# ప్రత్యుమాడి

శ్రీమతి గంజాం జ్యోత్స్న

శేషయ్యా...., రేపు నాన్నగారి తిథి. రిక్షావేయమాకు. ఇంటిదగ్గరే ఉండు. అంటూ పెద్దబ్బాయిగారి గొంతు ఇంట్లోంచి పెద్దగా వినిపించింది. రోడ్డుమీద నిలబెట్టి ఉన్న చెక్క రిక్షాన్ని తుడుస్తున్న శేషయ్య ఆ మాట వింటూనే అదిరి పడ్డాడు. గత సంవత్సరం అనుభవం గుర్తుకొచ్చి గతుక్కు మన్నాడు. శేషయ్య తండ్రి ఆదెయ్య చస్తూ చస్తూ తనకి అప్పగించినవి రెండే రెండు. ఒకటి ఈ పాత రిక్షా. రెండు, తను జీవితాంతం నమ్ము బలుక్కొని పనిచేసిన ఈ ఇల్లు. తండ్రి తరువాత కూడా శేషయ్య ఈ ఇంటిని వొదిలిపెట్టలేదు. ఆ మాటకొస్తే ఈ రిక్షాకూడా తన తండ్రికి పెద్దయ్యగారు కొనిపించిందే. రేపు రావలసిన సామాన్లన్నీ లిస్టు రాసి ఉంచాను. అమ్మగార్నాడిగి లిస్టు డబ్బులు తీసుకొని పచారీ షాపుకెళ్ళి అన్నీ తీసుకునిరా అన్నాడు పెద్దబ్బాయి.

ప్రహరీ గోడ వారగా పెట్టుకున్న స్కూటర్‌ను తీసి స్టార్ట్ చేసి రయ్‌మంటూ వెళ్ళిపోయాడు. తిథి అనగానే శేషయ్యకు పెద్దయ్యగారు గుర్తుకొచ్చారు. ఆయనకు తన తండ్రంటే ఎంతో అభిమానం. ఆయనకు ముగ్గురు కొడుకులు ఒకమ్మాయి. అయనేదో మంచి ఉద్యోగమే చేసి బాగా సంపాయించాడు. చాలా మంచివాడు. ఆయన సంతానంలో పెద్దబ్బాయిగారు మినహా అందరూ వేరేచోట్ల ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నాలుగు సంవత్సరాల క్రితమే ఆయనేదో వ్యాధితో పోయారు. రేపటి తిథికి ఈ సాయంత్రానికే అందరూ ఇంటికి చేరుకుంటారు.

కొద్దిగా మసక బడింది. ఇప్పుడు పనులు మొదలు పెట్టుకుంటే కానీ అర్ధరాత్రికైనా నడుము వాల్చటానికి వీలు చిక్కదు. కూర్చున్న వాడు మెల్లగా లేచాడు. నడుచుకుంటూ మధ్యహాలులోకెళ్ళి అమ్మగారు..., గట్టిగా కేకేసాడు. ఎవరూ అంటూ పెద్దమ్మగారు బయటకొచ్చింది. అబ్బాయిగారు పచారీ షాపుకెళ్ళి రమ్మన్నా రమ్మా., కోడలిగారినడిగి పట్టీ డబ్బులు తీసుకెళ్ళమన్నారు అని చెప్పాడు. పెద్దమ్మగారు బీరువాలోంచి తీసి ఐదు వందలు కాగితాలు శేషయ్య చేతిలో పెట్టారు. కోడలుగారు లోపలినుంచి వస్తూనే, ఈ సారయినా మంచి సరుకులు తీసుకునిరా. పోయిన సారి పప్పులో అన్నీ రాళ్ళే అంటూ సరుకుల పట్టీ చేతికిచ్చింది.

పచారీ షాప్‌నుంచి ఇంటికి చేరీ చేరగానే సరుకులు ఇంట్లో బెట్టి, బావి దగ్గరకు చేరి బక్కెట్టు నీళ్ళు తాగాడు. భుజంపై నున్న కండువాతో మొఖం తుడుచుకుంటూ వంచలోకి నడిచాడు. పెద్దబ్బాయిగారు పడక్కుర్చీలో పడుకొని ఉన్నారు. కింద కూర్చుని గోతాం మూట విప్పుతున్నాడు శేషయ్య. ఉప్పుల్నీ, పప్పుల్నీ వేరుచేసి పప్పులన్నీ చేటలో పోసి బాగుచేశాడు. తిరగబోత గింజలన్నింటినీ శుభ్రం చేసుకున్నాడు. ఈ లోగా వేయించిన పచ్చి పెసల్ని పెద్ద డబ్బాలోపోసి తీసుకొచ్చి శేషయ్య ముందుంచింది కోడలు. రెండు గోనె పట్టాలు పరుచుకొని తిరగలి పిడిని సరిచేసి కొట్టుకొని పెసలు విసురుతున్నాడు. వాటన్నింటినీ అత్తాకోడళ్ళిద్దరూ లోపలకు సర్దుకున్నారు. శేషయ్య దక్షిణవైపుగా సందులోంచి దొడ్లోకి చేరి కోడలొడ్డించిన అన్నం తిని బావి దగ్గర కంచాన్ని కడుక్కొని పంచెలో ఓ గూట్లో పెట్టుకున్నాడు. నిద్రబాగా వస్తుంది. బయట తాడుపై వేసున్న దుప్పట్ని భుజాన వేసుకుని మేడపైకి చేరి పక్క పరచుకున్నాడు.

ఒళ్ళు హూనం అయ్యేలా యిరగ బడ్డా సంవత్సరానికి కొకమారు కమ్మటి వప్పు కూడు దొరుకుతుంది. మూడు పచ్చళ్ళు, మూడు కూరలు, బూరె, గారె, పెసరపప్పు సాంబారులతో ఆపూ చేసే భోజనం ఏడాదంతా గుర్తుండేలా ఉంటుంది. వీటితోపాటుగా గారెల్లో నంజుడికి ఆవపచ్చడి, తిధినాడు ప్రత్యేకంగా చేసే నువ్వు పచ్చడి తలచుకోగానే వాడి నోట్లో నీళ్ళూరాయి. బీడీ చివరి దమ్ములాగి నేలకు రాచి ఒకమూలకు విసిరేశాడు. ఒళ్ళంతా విరుచుకుంటూ ఓ పక్కకు తిరిగి నిద్రలోకి జారుకున్నాడు. కొంత సేపటి తర్వాత మెలకువొచ్చింది. మెట్లెక్కుతూ ఎవరో డాబాపైకి వస్తున్నారు. ఒరే శేషయ్య అంటూ పెద్దబ్బాయిగారు దగ్గరి కొస్తాండటంతో ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు. ఏరా నిదురు పోయావా! పైకి వచ్చేముందు చెప్పక్కర్ల. పద పద... కిందకు నడువు. రైల్వేస్టేషన్‌కి రిక్షా తీసుకొనిపో. గోపీ లత వస్తున్నారు అనిచెప్పాడు. శేషయ్య చంకల బనియన్ను తగిలించి కళ్ళను చేతులతో నలుపుకుంటూ ఆవలిస్తూ కిందకు జేరి రిక్షా నడుపుకుంటూ స్టేషన్‌కు చేరాడు. తను అక్కడికి చేరేసరికి బండి రావటానికింకా టైమున్నట్లుగా ఉంది. కొంతసేపటికి పెద్ద శబ్దం చేసుకుంటూ రైలువచ్చి స్టేషన్‌లో ఆగింది. బిలబిలమంటూ జనాలు దిగుతున్నారు. ఓవర్ బ్రిడ్జీ మీదుగా స్టేషన్ వెలుపలి కొస్తున్నారు. కానీ శేషయ్యకు గోపీబాబు గారు, లతమ్మగారు కనబడలేదు. ఈ బండి కాదేమో అనుకున్నాడు. సూటూబూటూ వేసుకున్న వ్యక్తిని ఇదేమాట అడిగాడు. విజయవాడ బండేనాండీ అనీ. అవునని బదులిచ్చాడు అవతలి వ్యక్తి.


వచ్చిన్రంటావా! మధ్యలో సందేహ పడ్డాడు. ఇంతలో లగేజిని మోసుకు రావటానికి శ్రమపడుతూ భారంగా నడుస్తున్న కొంతమంది వ్యక్తులు లీలగా కన్పించారు. మెర్క్యురీ బల్బుల కాంతి మీద పడగానే వస్తున్నది వాళ్ళేనని గ్రహించాడు. రండిబాబు

రండి ఎదురుగా బోయిచేతిలో నున్న సామాను అందుకున్నాడు. వాళ్ళ చేతనున్న రెండు సూట్‌కేసులు నెత్తిన పెట్టుకుని రిక్షావైపు దారితీశాడు. గోపీ, అతని భార్య ఇద్దరి పిల్లలు మొత్తం రిక్షా బండెక్కి కూర్చున్నారు. సూట్‌కేసులను మెల్లగా వారి మధ్యలో సర్ది రిక్షా తొక్కు కుంటూ ఇంటి దారిపట్టాడు. అప్పటికి రాత్రి పదిన్నరయింది. ఉక్కగా ఉండటంతో బాగా చెమట పోసి ఒళ్ళంతా మంట పుట్టసాగింది. వస్తున్న రొప్పును ఆపుకుంటూ మెల్లగా ఇంటి ముందు రిక్షానాపుకున్నాడు. సామాన్లు దించి లోపల పెట్టాడు బాగా దప్పిక అవుతుండటంతో బావి దగ్గర చేరి మరోమారు బక్కెటు నీళ్ళుతాగి కాళ్ళు చేతులు మొఖంతో పాటు ఒళ్ళంతా తడుపుకొని కండువాతో తుడుస్తూ సేదతీరుతూ పంచలోకి చేరాడు. ఇక నన్నెళ్ళి పడుకోమంటారా. పెద్దబ్బాయిగారిని కళ్ళు వత్తుకుంటూ అడిగాడు. తాపీగా కుర్చీలోంచి లేచివస్తూ ఇప్పుడేరా తమ్ము ళ్ళిద్దరూ ఫోన్‌చేశారు. బస్సుకు బయలు దేరారట. బస్టాండ్‌కు పోయి వాళ్ళని కూడా తీసుకునిరా అన్నాడు పెద్దబ్బాయి గారు. పై ప్రాణం పైనే పోయినట్లనిపించింది. శేషయ్యకు నిద్ర బాగా ముంచుకొస్తుంది. ఒళ్ళంతా బడలికగా ఉంది. అయినా వాడికి తప్పింది గాదు. రిక్షా తీసుకొని బస్టాండ్‌కు చేరాడు. ఇంకా బస్సు రాకపోవటంతో బస్టాండ్‌లోని టీవీని చూస్తూ బీడీ ఎలిగించి చతికిల పడి కూర్చున్నాడు నేలమీద. ఒళ్ళు మర్చిపోయి సినిమా చూస్తూ పెద్దగా నవ్వుకుంటున్నాడు. ఇంతలో తుపాకి శబ్దం విని చెల్లా చెదురైన కాకుల్లాగా, నుంచున్న వారు కూర్చున్న వారందరూ సామాన్లు పట్టుకొని పరుగు లంకించుకోవటంతో ఆ వైపుగా చూశాడు శేషయ్య. తిరుపతి బస్సు వచ్చి ఆగింది. చిన్నబ్బాయి గారు వాళ్ళ ఆవిడ, పిల్లలతో సహా దిగారు. చివరి బాబు గూడా ఆ బస్సులోనే వచ్చారు. తుపుక్కున పక్కనుమ్మి వారికెదురు నడిచాడు శేషయ్య. ఏందయ్యగోరూ, తమరైనా కాస్త పెందలాడే రావచ్చు కదా అంటూ వారి చేతుల్లో సామాన్లు తీసుకొని వాళ్ళను కూడా రిక్షా వైపుకు నడిపించు కెళ్ళాడు.

ఇంటికెళ్ళిందే తడవుగా మేడపై కెళ్ళి, పక్కమీదకు వాలి పోయాడు.

ఇంకా కోడైనా కూసినట్లు లేదు. మసక ఇంకా చిక్కగానే ఉంది. శేషయ్యా అంటూ క్రిందనుంచి పెద్దమ్మగారి గొంతు వినపడటంతో చప్పున లేచి పక్కమడిచి ఓ మూల కిసిరేసి కిందకు దిగి ఎళ్ళి పోయాడు. తల నాదుగా అన్పిస్తుంది. ఒంట్లో ఒకటే నిస్సత్తువ. ఈ రోజు ఎట్లా నెట్టెయ్యాలో ఏమో! మనసులో అను కున్నాడు. శేషయ్య అప్పుడే కరంటు పోయిందిరా! నీళ్ళు లేనిదే ఒక్కపనీకాదు. ఆ తొట్లోకి నిండుగా నీళ్ళు బొయ్యి. పెద్దమ్మగారు చెప్పింది. సుబ్బి పెళ్ళి ఎంకి చావుకొచ్చింది. కరంటు పోయినందుకు తిట్టుకున్నాడు. దొడ్లో వాకిట్లో అన్నీ కలిపి దాదాపుగా ఐదు పెద్ద తొట్లకు నీళ్ళు పోశాడు బండెడు అంట్లను ముందేసుకుని కడిగేశాడు. లంకంత కొంప చుట్టూ నడుములు పోయ్యేలా వంగి చిమ్ముకున్నాడు. దాదాపు పది బకెట్ల నీళ్ళు కళ్ళాపు చల్లుకున్నాడు.

ఉదయం ఏడు గంటయ్యింది. శేషయ్యకు ఆకలేస్తోంది. కనీసం ఒక గుక్కెడు కాఫీ అయినా కడుపులోకి పోలేదు. రోజా ఈ వేళకి సుష్టుగా చద్దన్నం లాగించేసేవాడు. ఈ రోజు ఎవరి హడావిడిలో వారున్నారు. తనను తినమని అడిగినవారు లేరు. తనుగా అడిగితే బాగోదనుకున్నాడు. ఇంతలో చిన్నబాబుగారు కూరగాయల లిస్టు తెచ్చి శేషయ్య చేతిలో పెట్టాడు. శేషయ్య అతనివైపు నీరసంగా చూశాడు. దాన్ని అతను పట్టించుకోలేదు. కాస్త స్థిమిత పడ్డాక అతను ఇచ్చిన డబ్బులు తీసుకొని మార్కెట్టువైపు రిక్షాను నడిపించాడు. ఇంటికొచ్చేసరికి గంటపైగానే బట్టింది. కూరగాయలు కోడలుగారి చేతికందించాడు. కడుపులో ఎలుకలు పరిగెత్తుతున్నాయి. నీరసంగా అన్పిస్తోంది.



బావి దగ్గరికి చేరి నోట్లో నీళ్ళు పోసుకుని పుక్కిలించి ఉమ్మేశాడు. మొఖం కాళ్ళూ చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు. బావిపక్కగా దొడ్డి వాకిలి దగ్గరకు పోయి అమ్మగారు, అంటూ పిలిచాడు. ఎవరూ పలకలేదు. ఒకమెట్టు ఎక్కి గుమ్మాన్ని పట్టుకొని వంగి లోపలికి తొంగి చూశాడు. పెద్దమ్మగారు ఒక్కతే కన్పించారు. వంటింటి గుమ్మం గడపపై తలానించి ఒకపక్కకు తిరిగి కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నారు. నిరాశగా పంచవైపు నడుచుకుంటూ వచ్చాడు శేషయ్య. చేతిలోని పేపరు చదువుకుంటూ సిగరెట్ తాగుతూ కూర్చున్నాడు పెద్దబ్బాయి గారు. శేషయ్యను చూడగానే ఇంకా



**చెప్పి మరీ చేస్తా**

మునుపటికి, ఇప్పటికి మీనా చాలా తేడా కనిపిస్తోంది. మునుపటిరోజుల్లో మీనా తల్లి చాటు బిడ్డగా వుండేది. భయంగా వుంటూ తల్లి అనుమతితో సమాధానం చెప్పేది. మీనా చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పేస్తుంది. ప్రేమలో పడ్డానన్న పుకారు షికారు చేస్తోంది. నిజమే. ప్రేమలో పడితే దాచుకోవలసిన అవసరం ఏముంది? హాపీగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్తాను. పెళ్ళి చేసుకుంటే చచ్చినా రహస్యంగా చేసుకోను. బాజాభజంత్రీలతో పెళ్ళి చేసు కుంటాను. మన దగ్గర దాపరికాలుండవు... హాహా! అంది చిలిపిగా... ఎంతయినా ఆరి తేరిన నటికదా.

వంటమనిషి రాలేదేమిరా!? ఇంతవరకూ టిఫిన్‌లే కాకపోయె. మర్చిపోయి రాకపోతే దుంపతెగుతుంది. నువ్వు పోయి రిక్షా ఎక్కించుకుని తీసుకొనిరా అన్నాడు ఆమె ఉండే ఇల్లు శేషయ్యకు తెలియదు. అబ్బాయిగారిచ్చిన అడ్రస్ తీసుకుని అక్కడా ఇక్కడా వాకబు చేసుకుంటూ ఆమె దగ్గరికెళ్ళాడు. విషయం చెప్పి తనతో రమ్మన్నాడు. ఒక గుడ్డసంచీ చేతబట్టుకుని ఆమె రిక్షా ఎక్కి కూర్చుంది. రిక్షా తొక్కడానికి బలం చాలటంల. భారంగా దొర్లిస్తున్నాడు. ఆకలి బాధ ఎక్కువైంది. ఆమె దారిపొడవునా ఏవో కబుర్లు చెబుతూనే ఉంది. వాడికవి చెవికెక్కలేదు. ఎలాగోల ఇంటికి చేర్చాడు. వంట మనిషి స్నానమాడి మడికట్టుకొని మరీ టిఫిన్ చేసేసరికి గంట బట్టింది. ఒరే శేషయ్య, టిఫిన్ చేద్దువుగాని రా, త్వరగా తెమిలితే ఇంకా చాలా పన్లులున్నాయి. చిన్న కోడలుగారు పిలుస్తున్నారు. టిఫిన్ అనేమాట వినగానే ప్రాణం లేచొచ్చింది వాడికి. చెంగున దూకి ఒక్క అంగలో పంచలోకి చేరుకున్నాడు. దొడ్డివైపురా, చేతిలోని చిన్నవిస్తరిలో టిఫిన్ పట్టుకోసున్న కోడలు చెప్పింది. గబగబా దొడ్డి వైపునడిచాడు. ఆమె చేతివైపు చూడగానే నీరు గారిపోయాడు శేషయ్య. ఆమెచేతిలోని ఆకులో మూడుగరిటల ఉప్మా మాత్రమే ఉంది.

అది ఏమూలకొస్తుంది? తిన్న తర్వాత మరింత ఆకలి పెరగసాగింది. ఇందకాఫీ తీసుకో నాయనా, అంటూ వంటమనిషి ఓ చిన్నగ్లాసు చేతిలో పెట్టింది. ఆబగా రెండు గుటకల్లో తాగేశాడు. తొట్లో ఉన్న నీళ్ళతో గ్లాసు కడిగి బోర్లించి వెనుదిరిగేంతలో కాస్త గాడి పొయ్యి తీసివెట్టు నాయనా అంది వంటమనిషి. గాడి తవ్వటం ప్రారంభించాడు శేషయ్య. అసలే నీరసంగా ఉంది పైగా పొద్దు నడినెత్తికొచ్చింది. ఎండ చుర్రనిపిస్తోంది. పలుగు పైకెత్తుతుంటే చేతులు వణక సాగాయి. నాలుగు పోట్లెయ్యగానే అలతొచ్చింది. ఒళ్ళంతా చిమచిమలాడటం ప్రారంభమైంది. నుదుట పట్టిన చెమటను పై కండువాతో తుడుచుకున్నాడు అడుగు వేర గుంట తీశాడు. కాస్త అలుపార్చుకుందామని నిలబడ్డాడు. కట్టెలు పట్టవు నాయనా మరో అడుగుతీయి వంటమనిషి లాలనగా అంది. ఆమె వంక తేరిపార చూశాడు. నేలను పారతో పొడుస్తూ ఆమెతో మాట్లాడుతూ... యియ్యాల ఏమేమి సేత్తన్నారమ్మా అని అడిగాడు. వంటకాల, ఏముంది నాయనా! మూమూలే, బెండ, వంకాయ, కంద మూడుకూరలు, దోస, అల్లం, మామిడి మూడు పచ్చళ్ళు చేయాలి నాయనా. పైగా గారెబూరె ఒకటుండే పెసర పప్పు సాంబారు పులియోర మామూలే నాయా. నువ్వు పచ్చడి, ఆవ పచ్చడి చేయక తప్పదు కదా అంటూ వచ్చే.., వచ్చే..., ఎవరో పిలవటంతో ఆమె లోపలికెళ్ళింది. అది వినగానే శేషయ్యకు హుషారొచ్చింది. ఆ వంటకాల పేరు వినగానే నీరసం కొద్దిగా మాయమయినట్లనిపించింది.

దొండ్లోంచి పిండివంటలు ఘుమఘుమలు రాసాగాయి. పిల్లాపాప పంచలో ఆడుకుంటున్నారు. పెద్దబ్బాయి గారు ఎవరికోనవెూ వలువూర్లు గేటుకేసి చూస్తున్నారు. శేషయ్య పిల్లల ఆటలు చూస్తూ ఓ వైపు గోడకానుకొని కూర్చున్నాడు. అన్నయ్యా శాస్త్రిగారేమిటి ఇంకా రాలేదు. ఒంటి గంటవుతుంది. చిన్నబ్బాయిగారు మధ్యహాలులోంచి బయటకొస్తూ అడిగాడు. పంతులుగారి మాటసరే ఇంతకీ, కృష్ణమూర్తి శివయ్యా గార్లేరి? భోక్తలుగా రమ్మని నిన్నే చెప్పొచ్చాను. ఆదుర్దాగా చూశాడు పెద్దబ్బాయి గారు. మరి శేషయ్య నైనా పంపించు అసలే ఎండాకాలం, కడుపులు మండుతున్నాయి. అన్నాడు చిన్నబ్బాయి గారు. శేషయ్య గుండె గుభేలుమంది చుర్రుమంటున్న ఎండలో రెండు కిలోమీటర్లు తార్రోడ్డు మీద వెళ్ళాలి. పైగా వచ్చేటప్పుడు ఇద్దరు మనుషుల్ని తోలుకొనిరావాలి. ఇప్పటికే పేదాలెండుతున్నాయి. నాలుకపై తడారిపోయింది నీరసంతో నడుస్తుంటే తలపోటొస్తోంది శేషయ్య పోలేనేమో అనుకున్నాడు. వాడిని పోయి వాళ్ళని పిలుచుకు రమ్మన్నాడు. అబ్బాయిగారు హూ... నిట్టూరుస్తూ లేచి నిల్చొన్నాడు. నెమ్మదిగా బండి కొంత దూరం నడిపించి ఎక్కి, సీటుమీద కూర్చోగానే అది చుర్రుమంటంతో శేషయ్య సన్నగా మూలిగాడు. ఎండ సెగలు కక్కుతుంది. ఒళ్ళంతా చిమచిమ లాడుతుంది. కొద్ది దూరం పోగానే ఒంటిమీద బట్టలు కూడా కాలిపోసాగాయి. అయినా ఈ మాత్రం కట్టపడపోతే ఎలా! ఉత్తినే తిన్నా వంటబట్టదు. అందునా పప్పుకూడు అనుకున్నాడు. పెసరపప్పులో నెయ్యిపోసి అల్లపచ్చడి నంజుకుంటే ఎంతకమ్మ గుంటదో...! కడుపులో మంట మాట ఎలా ఉన్నా కొద్దిగా ఉషారొచ్చింది శేషయ్యకు. చల్లగా తాక్కుంటూ ఓ మలుపు తిరగ్గానే ఎదురుగా వస్తున్న ఓ గూడు బండి శేషయ్య బండిని గుద్దుకోబోయి కొద్దిలో ఆగింది. జరిగిన పొరపాటును గమనించి బండిని పక్కకు లాక్కున్నాడు.

ఏరా శేషయ్య, పంతులుగారొచ్చారా? అని ఎవరో అడగటంతో తల పక్కకు తిప్పి రిక్షావైపు చూశాడు. తల బయటకు పెట్టి చూస్తున్న కృష్ణమూర్తిగారి ముఖం ప్రశ్నార్థకంగా ఉంది. అయ్యా రాలేదు. అయ్యగారు మిమ్మల్ని తోలుకు రమ్మంటే మీ కాడికే వస్తున్నా అన్నాడు శేషయ్య. ఆయన పక్కనే శివయ్యగారు కూడా ఉన్నారు. ఆయనగారు లేకుండా మేమేం చేస్తాం రా! త్వరగా ఆయన్ను తీసుకురాపో. మాదేముంది తిని పోయేవాళ్ళం అన్నాడు.

పంతులుగారింటి తలుపు తట్టాడు శేషయ్య, వాటిని తెరుస్తూ తుర్రని లోపలికెళ్ళాడు ఓ పసివాడు. భౌ భౌమంటూ ఓ కుక్క ముందుకొచ్చింది. దాన్నదిలించుకుంటూ పంతులుగారు బయటి కొచ్చారు. వచ్చిన విషయం చెప్పాడు శేషయ్య. ఇప్పుడే

ఓ కార్యం జరిపించొచ్చాను. ఇదిగో బయలు దేరుతున్నానంటూ ఇంట్లోంచి ఓ చేతి సంచిని చంకలో పెట్టుకొని పంతులుగారు బయటకొచ్చారు. పదవోయ్ అంటూ రిక్షా ఎక్కాడు. బండి కిర్రు కిర్రులాడింది టైర్లు నేలకంటాయి. శేషయ్య ఒక తొక్కు తొక్కాడు. అంగుళం కూడా కదల్లేదు.

పండ్లు బిగబట్టి బలాన్నంతా కాళ్ళల్లోనికి తెచ్చుకొని మరో మారు బలవంతంగా ముక్కాడు. ఇక లాభం లేదనుకొన్నాడు. కొద్ది అడుగుల దూరం నడుస్తూ లాక్కెళ్ళి రొప్పుతూ రోస్తూ బండిని నడుపుతున్నాడు. ఉక్క ఒంటిని మండి స్తుంది. తల్లోంచి చెమటలు మొఖంపై కారుతున్నాయి. చెమటకు తడిసికళ్ళు మండుతున్నాయి. చెవుల్లోంచి ఆవిర్లొస్తు న్నాయి. ఒళ్ళంతా కాలుతున్న పెనంలా తయారయ్యింది. శేషయ్యకు శోషొచ్చేట్టుగా ఉంది. శక్తికి మించిన భారమంటే ఇదేనేమో అనుకున్నాడు శేషయ్య. బండి ఇంటికి కొద్ది అడుగుల దూరంలో ఉందనగా ధబేలుమని పెద్ద శబ్దం రావడంతో అదిరిపడ్డాడు శేషయ్య. చుట్టూ కలయజూశాడు ఏమీ కనిపించలేదు. అనుమానం వొచ్చి బండి కిందకొంగి చూశాడు. టైరు పంచరైంది. శాస్త్రిగారి వైపు జాలిగా చూశాడు నవ్వుతూ శాస్త్రిగారు ఎంతకీ దిగకపోవటంతో ఆ కొద్దిదూరం బండిని నడిపించుకెళ్ళాడు.

పంతులుగారు ఇంట్లో చితుకు పుల్లలతో హోమాన్ని రగిలించారు. వచ్చిన కృష్ణమూర్తిగారు శివయ్యగారు విష్ణుస్థానం లోనూ తండ్రిస్థానంలోనూ కూర్చున్నారు. దర్భ, పసుపు కలిపిన బియ్యం, నువ్వులు, తేనె, నెయ్యి, వీభూదిని ముందేసుకుని పంతులుగారేదో చదవటం ప్రారంభించారు. బయట కూచున్న శేషయ్య ఓరగా వేస్తున్న తలుపులోంచి ఇదంతా గమనిస్తున్నాడు. పొద్దు పడమటి దిశపట్టింది.

ఆకలి బాధ నొప్పిగా మారింది. కళ్ళు మూసుకుపోతూ మగత ముంచుకు రావటంతో పంచలోనే ఓ పక్కకి మళ్ళి ఒత్తిగిల్లి పడుకున్నాడు. శేషయ్య. రెండుగంటలు పైగానే గడిచింది. చంటోడ్ని త్తుకుని బయటకొచ్చిన అమ్మాయి గారు శేషయ్యవాలకాన్ని చూసి ఏంటిరా! శేషయ్య, ఇలా పడుకున్నావ్. అంటూ లేపింది. మేలుకుంటూనే భోజనానికా అమ్మాయిగారు! అన్నాడు శేషయ్య. అప్పుడే ఏం భోజనం! పంతులుగార్లు తినాలి. అన్నయ్య వాళ్ళు తినాలి. తరువాతే మనకు అని చెప్పి వాడివైపు చూసింది. పూర్తిగా ఆమె మాటను విన్నట్టుగా కూడా లేదు. నీరసించి నిద్రపోసాగాడు. పొద్దు ఇంకొంత క్రుంగింది. కావ్...కావ్ మని అబ్బాయిగార్లు అరుస్తు న్నారు. శేషయ్య కళ్ళు తెరచి చూశాడు కార్యం పూర్తయ్యిందేమో గోడపైన పిండాల్ని బెట్టి కాకుల్ని పిలుస్తున్నారు. చుట్టూ చూస్తూ వారెంత పిల్చినా ఒక్కకాకీ రాలేదు. గొంతులు పిడచగట్టుకు పోతున్నాయి. శేషయ్యను లేపు. అరుస్తాడు. అన్నాడు చిన్నబ్బాయిగారు అసహనంగా శేషయ్యను లేపి అరవమన్నారు. నీరసంగా లేస్తూ దీనంగా వాడు నాలుగు వైపులా చూశాడు. కళ్ళు మూసుకు పోతున్నాయి. ఓపికను తెచ్చుకొని పెద్దగా కావ్, కావ్ మని అరిచాడు. వాడి గొంతులో అది ఆకలి కేకలా విన్పిస్తోంది. కరుణించి వాలి కాకులు పిండాల్ని ఎత్తుకు పోయాయి. అరుగుపైకి చేరి సోలిపోయాడు లేత మసక కమ్ముకుంటుంది. నిద్రపోతున్న శేషయ్య మొఖంపై ఈగలు వ్రాలి ఉన్నాయి. వాడు నోరు తెరుచుకొని గాఢంగా శ్వాసిస్తూ గుర్రుపెడ్తున్నాడు. పెద్ద శబ్దం చేస్తూ తలుపు తెరుచుకోవటంతో మెలకువొచ్చింది. శాస్త్రిగారు పంతుళ్ళిద్దరూ తాంబూలాలు నవులుతూ బయటకొస్తున్నారు. వారి వెనకగా వచ్చిన పెద్దబ్బాయిగారు శేషయ్యా దొడ్లో ఈమూల ఓ గుంట తీయి చేయి చాచి చూపిస్తూ చెప్పాడు. నిజానికి శేషయ్యకు నడిచే ఓపిక కూడా లేదు. కాళ్ళూ చేతులు వణుకుతున్నాయి. చేతిలో పలుగు పట్టు తప్పుతోంది. ఎలాగోలా పళ్ళ బిగువుతో దాన్ని పైకెత్తాడు పైకెత్తిందే తరువాయి. తన ప్రమేయం లేకుండానే అది పడ్తోంది. గుంట తీసి ఇంట్లోని ఎంగిలిస్తర్లను అందులో పూడ్చి నిస్సారంగా అక్కడే కూలబడ్డాడు.

మసక చిక్కబడ్తోంది. శేషయ్యలో ఆకలి చచ్చిపోతుంది. పప్పు పాయసాల ఆశ వాడికిప్పుడు లేదు. గారెలు, బూరెలు అవసరంలేదు. రెండు ముద్దలు పచ్చడి మెతుకులైనా చాలు. ఏదో ఒకటి కడుపులోకి పోతే కానీ ప్రాణం నిలిచేటట్టులేదు. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ దొడ్డి వాకిటి చేరాడు. ఇక ఆగలేక అమ్మా, అంటూ పిలిచాడు. గొంతులో గీరపలికింది. నవ్వుతూ వంట మనిషి బయటకొచ్చింది. నోటి దగ్గర చేతినుంచి భోజనం అంటూ సైగ చేశాడు. ఆమె శేషయ్యను కింది నుంచి పైకి ఒకసారి పరిశీలనగా చూసింది. అబ్బాయి వాళ్ళు కూర్చున్నారు. అయిపోయిందిలే. కాళ్ళూ చేతులు కడుక్కొని రడీగా ఉండు. ఐదు నిమి షాల్లో వడ్డిస్తాను. అంది జాలిగా. వాడు ఆమెవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు. బావి దగ్గరకు చేరి ఒంటిపై బక్కెటు నీళ్ళు కుమ్మరించుకుని తాపాన్ని చల్లబరచు కున్నాడు. ఆకలిగా వంటగదివైపు చూస్తున్నాడు. చిన్నబ్బాయిగారు బయట కొచ్చారు. ఆయన చేతిలో ఒక మూటుంది.

శేషయ్యా, ఇవి నాన్నగారి నైవేద్య పిండాలు. గోవుకి తినిపించాలి. పక్కన కామయ్యగారి దొడ్లో ఉన్న గోవుని తోలుకురా అన్నాడు భారంగా నిట్టూరుస్తూ రెండు చేతులనూ మోకాళ్ళపై ఆన్చి కూర్చున్నవాడు లేస్తూ సందువైపు కదిలాడు. దబేల్‌మంటూ సందులోంచి పెద్ద శబ్దం విన్పించటంతో అందరూ ఆ వైపుగా వెళ్ళారు రెండు కాళ్ళు పైకెత్తి అడ్డంగా పడి ఉన్నాడు శేషయ్య. ●



## ఓవర్‌నైట్ హీరోయిన్

చాలా చిత్రాల్లో నటించిన సంఘవికి పిక్చర్లయితే వస్తున్నాయి. కాని సరైన బ్రేక్ రాక పోవడం ఆశ్చర్యకరమే. సంఘవి పొగరుమోతు కాదు. ప్రొడ్యూసర్లని ఏడిపించదు. పోనీ ట్రీట్‌మెంట్ సరిగ్గాలేదని ప్రొడక్షను వాళ్లను ఏడిపిస్తుందా అంటే అదీ లేదు. అయితే ఎందుకని ఆశించినంత స్థాయిని చేరుకోలేక పోతోంది? చాలామంది అన్నమాట ఒక్కటే. అదృష్టం అంటారు. అదృష్టాన్ని నేను నమ్మను అంటుంది సంఘవి. అదృష్టాన్ని నమ్మకపోతే ఉత్తరాది భామలు తెలుగులో ఎందుకు రాజ్యం చేస్తారు? తెలుగు చిత్రాల్లో ఈరోజు నలభై లక్షలు, అరవై లక్షలు తీసుకుంటు న్నారంటే ఎలా తీసుకోగలుగు తున్నారు? సంఘవి మండిపడుతోంది. చూడండి. అలా చూస్తుండగానే సూపర్‌స్టార్ అయిపోతానం టోంది నమ్మకంగా. మరి అలా అయిపోతే మంచిదేగా!